సాక్షి తిరుపతి

బుధవారం। 17। మే। 2023



మాంత్రికుడు లైంగికదాడికి యత్నం

చేతబడి అనుమానంతో తన వద్దకు వచ్చిన మహిళను ఓ మాంత్రికుడు లైంగిక దాడికి యత్నించాడు. -8లో



సుడిగాలి పర్యటన

ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తిరుపతి జిల్లా ప్రత్యేకాధికారి శ్యామలరావు మంగళవారం తిరుపతిలో సుడిగాలి పర్యటన చేశారు. -8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	27
చిత్తూరు	41	27
తిరుమల	37	24
గూడూరు	43	30
నగరి	42	28

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 70,366 మంది స్వామివారిని దర్శించుకోగా.. 38,653 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.32 కోట్లు లభించాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తుండగా.. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లోనే దర్శనం లభిస్తోంది.

ఏపీ ఈఏపీసెట్‌కు 207మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్‌లో భాగంగా రెండో రోజు తిరుపతి జిల్లా వ్యాప్తంగా 207మంది గైర్హాజరయ్యారు. ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలో భాగంగా ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు సెషన్స్‌లలో పరీక్షను తిరుపతిలో 3, పుత్తూరులో 2, గూడూరులో 3, మొత్తం 8పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షకు రెండు సెషన్స్‌ల్లో కలిపి 4,144మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా వారిలో 207మంది గైర్హాజరైనట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

వడగాల్పులతో జాగ్రత్త



మాట్లాడుతున్న డీసీఎల్ బాలునాయక్

తిరుపతి రూరల్: వేడి వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని కార్మికశాఖ తిరుపతి జిల్లా ఉప కమిషనర్ బాలునాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతిలోని డీసీఎల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో పనిచేసే చోట కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం యజమాన్యలు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట ఉద్యోగులు, కార్మికుల పనివేళలను రీషెడ్యూల్ చేయాలని చెప్పారు.

తమిళనాడు స్పీడ్ బోట్లతో నష్టం



ఎంపీ గురుమూర్తితో మత్స్యకారులు

తిరుపతి మంగళం: తమిళనాడు నుంచి మత్స్యకారులు తీసుకొచ్చే స్పీడ్ బోట్లతో మత్స్య సంపద దొరక్క తీవ్రంగా నష్టపోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి నగరంలోని ఎంపీ కార్యాలయంలో మత్స్యకారులు తమ సమస్యలను ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం పరిధిలోని వాకాడు మండలం, తూపిలిపాళెం, దుగరాజపట్నం, జమీన్ కొత్తపాళెం పంచాయతీల పరిధిలోని తీరప్రాంతాన్ని నమ్ముకుని వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. చిన్న చిన్న మరబోట్ల సాయంతో చేపలు పట్టుకుని బతుకుతున్నామని, అయితే తమిళనాడు నుంచి పెద్దపెద్ద స్పీడ్‌బోట్లలో అక్కడి మత్స్యకారులు తీర ప్రాంతంలోకి చొరబడి మత్స్య సంపద కొల్లగొడుతున్నారని వాపోయారు. స్పందించిన ఎంపీ ఫిషరీస్ ఆపరేటివ్ డెవలెప్మెంట్ చైర్మన్‌తో ఫోన్లో మాట్లాడారు. తమిళనాడు నుంచి వస్తున్న మత్స్యకారులను నిలువరించేందుకు పెద్దబోట్లు కొనుగోలు చేయడానికి అవసరమైన నిధులను ఎంపీ నిధుల నుంచి అందజేస్తానని, తక్షణం బోట్లు కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలానే ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌తో మాట్లాడి తూపిలిపాలెం గ్రామానికి బస్సు సదుపాయం కల్పిస్తానని చెప్పారు.

పిడుగు పడి కౌలు రైతు మృతి

రేణిగుంట : మండలంలోని కృష్ణాపురం పంచాయతీ దిగుమల్లవరం గ్రామానికి చెందిన నాగముంతల హరినాథ్ (47) మంగళవారం పిడుగుపాటుకు గురై దుర్మరణం చెందాడు. స్థానికులు కథనం మేరకు.. దిగువ మల్లవరానికి చెందిన హరినాథ్ క్రిష్ణాపురానికి చెందిన మునస్వామి అనే రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయ పనులు చేస్తున్నాడు. మంగళవారం పొలానికి వెళుతుండగా పెద్ద ఉరుములతో కూడిన వర్షం మొదలయింది. హఠాత్తుగా పిడుగుపడి పొలంలోనే కౌలు రైతు మృతిచెందాడు. మృతుని భార్య రాజేశ్వరి కూడా భర్తకు వ్యవసాయ పనుల్లో చేదోడు, వాదోడుగా ఉంటోంది. ఇద్దరు కుమార్తెలు మొదటి కుమార్తె పేరు గీత పాలిటెక్నిక్ రెండవ సంవత్సరం చదువుతుండగా, రెండో కుమార్తె 9వ తరగతి చదువుతోంది. హరినాథ్ మృతితో భార్య, పిల్లలు భోరున విలపించారు.

వేషాలతో అలరించి.. భక్తజనం పులకించి!

శ్రీతాతయ్యగుంట గంగ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈనెల 9వ తేదీ రాత్రి చాటింపుతో మొదలైన జాతర వేడుకలు వారం రోజుల పాటు కోలాహలం చేపట్టారు. విభిన్న వేషాలతో అమ్మవారిని దర్శించి భక్తులు పునీతులయ్యారు. మరికొందరు జంతుబలులిచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డితోపాటు మేయర్, డెప్యూటీ మేయర్లు, పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు.



భక్తులతో కిక్కిరిసిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం

- కోలాహలంగా తిరుపతి గంగజాతర
- భక్తులతో పోటెత్తిన ఆలయం
- జాతర వేషాలతో పులకించిన తిరునగరి
- అర్ధరాత్రి అమ్మవారి విశ్వరూప దర్శనం



అమ్మవారికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి కల్చరల్: తిరుపతి జాతరకు జనం పోటెత్తారు. జాతర చివరి రోజు కావడంతో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. సోమవారం అర్ధరాత్రి మహాశాంతి అభిషేకం తర్వాత అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. పొర్లుండాలతో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడిలో భాగంగా కొందరు వేపాకు చీరలతో గంగమ్మను దర్శించుకున్నారు. భక్తులు వివిధ పౌరాణిక, జానపద, స్త్రీ వేషధారణలతో తిరునగరిలో పర్యటిస్తూ.. కేరింతలు కొడుతూ సందడి చేశారు. డప్పు దరువులకు అనుగుణంగా చిందులేస్తూ ఆకట్టుకున్నారు. భక్తజనంతో గంగమ్మ ఆలయ దారులు హోరెత్తాయి. ఆలయ అధికారులు, పోలీసులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. గంగమ్మ ఆలయం మజ్జిగ, అంబళ్లు పంపిణీ చేశారు.

'గంగ'రంగ వైభవంగా సారెలు

తిరుమల వెంకన్న చెల్లెలుగా విరాజిల్లుతున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయం తెల్సిందే. ఈనేపథ్యంలో జాతర విశిష్టత నలుదిశలా వ్యాప్తి చెందేలా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కంకణ బద్ధులయ్యారు. రూ.16 కోట్లతో గంగమ్మ ఆలయాన్ని అద్భుత రీతిలో నిర్మించారు. గంగమ్మ ఆలయ రహదారులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది, సరికొత్త రీతిలో జాతర ప్రచారం చేపట్టారు. నగరంలో ప్రతి గడపకు ఆహ్వానం అందించి జాతరలో భాస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. జాతర చాటింపు నాడే జానపద కళా ప్రదర్శనలతో హోరెత్తించారు. అమ్మవారికి వారం రోజుల పాటు రాష్ట్ర మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విశ్వరూప దర్శనం.. సర్వపాపహరణం

గంగమ్మ జాతర మహోత్సవంలో చివరి రోజు మంగళవారం అర్ధరాత్రి తర్వాత విశ్వరూపంతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలోని అమ్మవారి విశ్వరూప కొడిస్తంభం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. బంకమట్టితో సర్వాంగసుందరంగా అమ్మవారి విశ్వరూప ప్రతిమ కొలువు తీర్చనున్నారు. విశ్వరూప ప్రతిమ చెంపను పేరంటాల వేషధారుడు నరకడంతో జాతర సమాప్తం కానుంది.



అభిషేక పూజల్లో మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి



విశేష అలంకరణలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ



అమ్మవారి వేషధారణ

గంగమ్మ సేవలో అమ్మవారి కుటుంబీకులు

గంగమ్మతల్లి కుటుంబీకులు మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుమల అర్చకులైన నరేష్‌దీక్షితులు, బద్రినారాయణ దీక్షితులు తిరుపతి గంగమ్మ తల్లికి చెందిన కుటుంబీకులు. అనాదిగా వస్తున్న ఆచారం మేరకు తిరుపతి గంగమ్మ తల్లి వీరికి ఇలదైవంగా పూజలు అందిస్తున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వీరికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.



స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్

టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో నడుస్తున్న శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో 2023 - 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 17 నుంచి జూన్ 5వ తేదీలోపు విద్యార్థులు 'ఏడీఎంఐఎస్ఎస్ ఐఓఎన్.టీఐఆర్‌యూఎంఏఎల్ఏ.ఓఆర్‌జీ' వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం ఇంగ్లిష్‌లోనే ఉంటుందని, అయితే విద్యార్థుల సౌకర్యార్థం యూజర్ మాన్యువల్, ఆయా కళాశాలల ప్రాస్పెక్టస్‌ను ఇంగ్లిష్, తెలుగులో ఉంచామని తెలిపారు. ఇంగ్లిష్, తెలుగులో ఉన్న దరఖాస్తు చేసే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, అలాగే ఆయా కళాశాలల్లో అందుబాటులో ఉన్న గ్రూపులు, సీట్లు, ప్రవేశానికి అర్హతలు, సీట్ల భర్తీ విధానం, మార్గదర్శకాలు తదితర వివరాలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ముగిశాక విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఆయా కళాశాలల్లో సీట్లను తాత్కాలింగా ఆన్‌లైన్‌లో కేటాయించి, ఆ వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా విద్యార్థులకు పంపుతామని పేర్కొన్నారు.

సిక్సర్ల మోత

తుమ్మలగుంటలో జరుగుతున్న చంద్రగిరి ఐపీఎల్‌లో మూడో రోజు మంగళవారం సిక్సర్ల మోత మోగింది. పల్లెటూరి యువకుల బాదుడుకు బంతి మైదానం బయటకు పరుగులు పెట్టింది. బ్యాట్ చేతబట్టి మైదానంలోకి దిగిన యువకులు పరుగుల వర్షం కురిపించడంతో స్కోర్ బోర్డు తారజువ్వలా దూసుకుపోయింది. అంగ వైకల్యాన్ని జయించి ఒంటి చేత్తో సిక్సర్లు కొట్టిన వేదాంతపురానికి చెందిన మునిశేఖర్ అందరినీ ఆకట్టుకున్నాడు. మూడో రోజు మొత్తం 52 మ్యాచ్‌లు జరిగాయి.

- చంద్రగిరి ఐపీఎల్‌లో పరుగుల ప్రవాహం
- ఒంటి చేత్తో సిక్సర్లు బాదిన వేదాంతపురం సింగిల్ హ్యాండ్ సచిన్
- క్రీడాకారులతో మమేకమైన మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి
- 52 మ్యాచ్‌లతో కిక్కిరిసిన క్రీడామైదానం



సింగిల్ హ్యాండ్‌తో పరుగుల వరద పారిస్తున్న వేదాంతపురానికి చెందిన మునిశేఖర్

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మలగుంట వేదికగా జరుగుతున్న వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. ముందుగా నిర్ణయించిన సమయానికి క్రీడాకారులు మైదానానికి చేరుకుని తమకు కేటాయించిన గ్రౌండ్లలో పోటీకి సిద్ధమవుతున్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి క్రికెట్ కిట్లు, మెడల్స్, ప్రశంసపత్రాలను మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అందించారు.

ఒంటి చేత్తో.. చితక్కొట్టాడు

సింగిల్ హ్యాండ్ సచిన్‌గా పిలిచే తిరుపతి రూరల్ మండలం వేదాంతపురానికి చెందిన మునిశేఖర్‌కు కుడి చేయి మాత్రమే ఉంది. ఆత్మస్థైర్యంతో బరిలోకి దిగాడు. ఒంటి చేత్తో సిక్సర్లు కొడుతూ మైదానంలో పరుగుల వర్షం కురిపించాడు. ఐదు సిక్సర్లు, నాలుగు ఫోర్లు కొట్టి 62 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతని బ్యాటింగ్ ప్రావిణ్యాన్ని చూసేందుకు క్రీడాకారులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అద్భుతమైన ఆటతీరుతో అంగవైకల్యాన్ని జయించి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు.

ఆటగాళ్లతో కిక్కిరిసిన క్రీడామైదానం

ఒకేసారి 16 మ్యాచ్‌లు నిర్వహించేందుకు భారీగా 16 పిచ్‌లను సిద్ధం చేయడం, ప్రతి గ్రౌండ్‌లోనూ మ్యాచ్‌లు జరుగుతుండడం, వాటిని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు సైతం తరలిరావడంతో తుమ్మలగుంట క్రీడా కాంప్లెక్స్ జన జాతరను తలపించింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన మ్యాచ్‌లు సాయంత్రం 5.30గంటలకు ముగిశాయి. మొత్తం 52 మ్యాచ్‌లను నిర్వహించగా 26 జట్లు విజయం సాధించాయి. విజేతలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆయా గ్రౌండ్లలో ట్రోఫీలను బహుమతులుగా అందించారు.



క్రీడాకారులకు క్రికెట్ కిట్, ప్రశంసాపత్రాలను అందిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



విజేతలకు మెడల్స్‌ను బహూకరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

మత్స్యకారులకు కొండంత భరోసా

- కలెక్టరేట్‌లో అట్టహాసంగా మత్స్యకార భరోసా కార్యక్రమం
- జిల్లాలో 3647 మందికి, రూ.364.70 లక్షల లబ్ధి



మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఇతర అధికారులు

తిరుపతి అర్బన్: మత్స్యకారుల అభివృద్ధితోపాటు వారి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం బాపట్ల జిల్లా నిజాంపట్నం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అదే సమయంలో తిరుపతి కలెక్టరేట్ నుంచి సీఎం ప్రసంగాన్ని అధికారులతోపాటు పలువురు మత్స్యకారులు వీక్షించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ వైఎస్సార్ మత్స్యకార భరోసా మెగా చెక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 3647 మంది మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద రూ.364.70 లక్షలు వారి ఖాతాలో జమచేసినట్టు తెలిపారు. వరుసగా ఐదో సారి ఈ పథకాన్ని ప్రభుత్వ అమలు చేసిందన్నారు. వేట విరామ సమయంలో మత్స్యకారులు ఇంటి వద్దే ఉండడంతో ఆ సమయంలో కుటుంబ పోషణ కోసం ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఇస్తున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీనివాస్ నాయక్, ఉప జిల్లా అధికారి చాంద్‌బాషా, తిరుపతి డివిజన్ అధికారి వెంకటరమణ, కోస్టల్ ఎఫ్‌డీవో రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా పొందాను



నా పేరు వెంకటరమణ. నేను వాకాడు మండలంలో నివసిస్తున్నాను. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద నాలుగు విడతల్లో రూ.10 వేల చొప్పున ఇప్పటివరకు రూ.40 వేలు పొందాను. లీటర్ డీజిల్‌కు సబ్సిడీ రూ.9 చొప్పున సబ్సిడీ ఇవ్వడం సంతోషాన్నిస్తోంది. ఇప్పుడు ఐదో విడత కింద మత్స్యకార భరోసా పొందాను. ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు.

జగనన్నకు రుణపడి ఉంటా



నా పేరు మహేంద్ర. మాది తడమండలం. మత్స్యకార భరోసా పథకమే కాకుండా వేట చేస్తూ అకస్మాత్తుగా మరణించిన మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునే దిశగా ప్రభుత్వం రూ. 10 లక్షలు అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను.

హోరుగాలి



పాపానాయుడు పేట వద్ద కూలిన ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి రూరల్: విద్యుత్‌శాఖకు హోరుగాలి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మంగళవారం మధ్యాహ్నం మధ్య వీచిన పెనుగాలి బీభత్సం సృష్టించింది. తిరుపతి రూరల్ డివిజన్ పరిధిలోని శ్రీకాళహస్తి రూరల్, ఏర్పేడు, పాపానాయుడుపేట, ఎండీ పుత్తూరు సెక్షన్ల పరిధిలో దాదాపు 20 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. 45కు పైగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్‌కు దాదాపు రూ.20 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. తిరుపతి రూరల్ ఈఈ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధప్రతిపాదికన మరమ్మతు చర్యలు చేపట్టారు.

ఎండలు బాబోయ్



నిర్మానుష్యంగా జాతీయ రహదారి

ఎండ మండుతోంది. ఉదయం ఏడు నుంచే జనాలను బెంబేలెత్తిస్తోంది. మునుపెన్నడూ లేనివిధంగా మంగళవారం ఎండ తీవ్రత రెట్టింపయ్యింది. గూడూరు నియోజకవర్గంలో 45 డిగ్రీలు దాటింది. కోట క్రాస్ రోడ్డు నుంచి బూదనం వరకు జాతీయ రహదారి వెంబడి ఉన్న చెట్ల కింద భారీ వాహనాలను డ్రైవర్లు నిలిపి వేసి చెట్ల కింద సేద తీరడం కనిపించింది. – చిల్లకూరు

మనసు'పరిమళం'



కొత్త పరిమళం నాటికలోని ఓ సన్నివేశం

గూడూరు: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ ఓపెన్ ఆడిటోరియంలో జాతీయ స్థాయి నాటక పోటీలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా, బొరివంకకు చెందిన శార్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారు ప్రదర్శించిన 'కొత్త పరిమళం' నాటిక ఆకుట్టుకుంది. ఈ నాటిక ద్వారా మూడవ ప్రపంచ యుద్ధభయంతో ప్రజలు క్షణమొక యుగంగా బతుకులీడ్చుస్తున్న జీవితగాథలను కళాకారులు కళ్లకు కట్టారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన సిరిమువ్వ కల్చరల్స్ ద్వారా ప్రదర్శించిన 'థింక్' (ఆలోచన) నాటిక ఆకట్టుకుంది.

నాటికలు జీవితాలకు అద్దం పట్టేలా ఉన్నాయ్

సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న నాటికలు మన జీవితాలకు అద్దం పట్టేలా ఉన్నాయని ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం రాత్రి నిర్వహించిన నాటికల్లో కళాకారులకు మెమెంటోలు అందించారు.

క్లుప్తంగా

వియ్యంకురాలింటికెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విశ్రాంత వైద్యులకు గాయాలు



డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిన కారు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చిత్తూరు–తిరుపతి జాతీయ రహదారి చంద్రగిరి మండలం రాయలపురం వద్ద ఓ కారు బోల్తా పడడంతో ఇద్దరు విశ్రాంత వైద్యులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. తిరుపతి రఘునాథ్ రిసార్ట్స్ చెందిన విశ్రాంత వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ తన భార్య డాక్టర్ లలితకుమారితో కలిసి చిత్తూరులో ఉన్న వియ్యంకురాలు రుక్మిణీ ఇంటికి వెళ్లి సొంత కారులో తిరిగి వస్తున్నారు. చంద్రగిరి మండలం, రాయలపురం సమీపంలో కారు డివైడర్ ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో భార్యాభర్తలిద్దరూ గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తిరుపతి నారాయణాద్రి ఆసుపత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత

దొరవారిసత్రం: నెల్లూరుకు 298 బస్తాలతో తరలిపోతున్న రేషన్ బియ్యం లారీని సీఎస్ డీటీ ఓబయ్య ఆధ్వర్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ ఘటన దొరవారిసత్రం మండలం, నెలబల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. సీఎస్ డీటీ కథనం.. సూళ్లూరుపేట మండలం, మన్నారుపోలూరు గ్రామం నుంచి నెల్లూరుకు రేషన్ బియ్యంతో తరలిపోతున్న విషయం ముందుగానే తెలియడంతో నెలబల్లి వద్ద నిఘా ఉంచి లారీతో పాటు, డ్రైవర్ వినోద్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

మిస్టరీ మంటల మూలాలపై ఆరా!



శానంబట్ల గ్రామంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఏఎస్పీ, డీఎస్పీలు

- కొత్తశానంబట్లలో ఇంటింటా పోలీసుల తనిఖీ
- బయటపడ్డ నాటు బాంబులు!

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం, శానంబట్లలో 20 రోజులుగా గ్రామస్తులకు, అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న మిస్టరీ మంటల మూలాలపై పోలీసులు దృష్టి సారించారు. 60 మంది పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి మంగళవారం ఇంటింటా శోధించడం ప్రారంభించారు. చంద్రగిరి మండలం, కొత్త శానంబట్ల గ్రామంలో ఏడు గృహాలలో మంటలు చేలరేగడం, గడ్డివాములు కాలిపోవడం చర్చనీయాంశమైంది. ఉన్నట్లుండి ఓ మహిళ కట్టుకున్న చీర కాలిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గ్రామానికి అరిష్టం జరుగుతోందని గ్రామస్తులు మంత్రగాళ్లను ఆశ్రయించారు. గ్రామంలో ఇప్పటికే అష్టబంధనం కూడా చేశారు. గ్రామస్తుల ఆందోళనతో ఆ గ్రామంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. కానీ మంటలు ఆగకపోవడంతో మంగళవారం పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు యశ్వంత్, రవికుమార్, సురేష్ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించి వివరాలు సేకరించారు. ఇంట్లో వస్తువులను తనఖీ చేశారు. కొత్తగా ఇంటికి బయట నుంచి బంధువులు కానీ, స్నేహితులు కానీ ఎవరైనా వచ్చారా అని విచారించారు. మంటలు ఏమైనా సంభవించాయా, మంటలు ఎలా సంభవించాయి అనేదానిపై ఆరాతీశారు.

ఏఎస్పీ పరిశీలన

చంద్రగిరి మండలం, కొత్తశానంబట్ల గ్రామంలో మంటలు చెలరేగిన ప్రదేశాలను తిరపతి ఏఎస్పీ కులశేఖర్ పరిశీలించారు. దీనిపై తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడారు. చిన్న అనుమానం వచ్చినా తమకు తెలియజేయాలని, గృహాలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. మంటలు ఎలా చెలరేగాయి, ఎవరైనా ఆకతాయిలు పెట్టారా, లేక వేరే కారణాలు ఉన్నాయా అనే కోణంలో విషయాలు పరిశీలించాలన్నారు. అనుమానం వచ్చిన వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు.

మంటల మిస్టరీని ఛేదిస్తాం

శానంబట్ల గ్రామంలో మిస్టరీ మంటలను ఛేదిస్తామని చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. శానంబట్ల గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వారం రోజులుగా జరుగుతున్న ఈ తతంగంపై వివరాలు సేకరించామని, ప్రజలు క్షుద్రపూజలు, మూఢనమ్మకాలు నమ్మొద్దని తెలిపారు. మంటల మిస్టరీ ఛేదిస్తామని చెప్పారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని, ఇక్కడే ఓ ఫైర్ ఇంజిన్ అందుబాటులో ఉంచామని తెలిపారు. కాలిన దుస్తులు, గడ్డిని ల్యాబ్‌కు పంపామని, ఫలితాలు రెండు రోజుల్లో వస్తాయన్నారు. ఎవరూ భయపడకుండా ఉండాలని ఆయన సూచించారు.

నాటు బాంబులు, టపాకాయలు స్వాధీనం?

శానంబట్ల గ్రామంలో మిస్టరీ మంటల విషయంలో పోలీసులు ప్రతి ఇంటినీ తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో పలు గృహాలలో నాటు బాంబులు, టపాకాయలు, విభూది స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. కేవలం తనిఖీలు నిర్వహించామని తెలిపారు. పోలీసుల తనిఖీల పట్ల పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

విశ్రాంత లైన్‌మన్‌ది హత్యేనా?

- ఏడాది క్రితం అదృశ్యమైన వెంకటేష్
- యాదృచ్ఛికంగా వెలుగులోకి వచ్చిన హత్య ఘటన
- హత్యకు పాల్పడింది వరదయ్యపాళెం వాసులే
- పోలీసుల అదుపులో నిందితులు.. గోప్యంగా కొనసాగుతున్న విచారణ

వరదయ్యపాళెం: ఏడాది క్రితం అదృశ్యమైన విశ్రాంత విద్యుత్‌శాఖ లైన్‌మన్ వెంకటేష్‌ను సన్నిహితంగా ఉన్న వ్యాపారి హతమార్చినట్లు సమాచారం. ఓ మోటారు బైకు కేసులో సీఎల్ఎస్ పల్లికి చెందిన వ్యక్తిని వరదయ్యపాళెం పోలీసులు విచారించిన ఘటనలో యాదృచ్ఛికంగా విశ్రాంత లైన్‌మన్ హత్య ఉదంతం వెలుగులోకి రావడం వరదయ్యపాళెంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ హత్య ఉదంతంలో వరదయ్యపాళెంలోని ఓ వ్యాపారి నేతృత్వంలో జరిగిన ఈ ఘటనలో అంబూరు గిరిజన కాలనీకి చెందిన వ్యక్తి, సీఎల్ఎస్‌పల్లికి చెందిన మరో వ్యక్తి ఉన్నారని సమాచారం. వీరు ప్రస్తుతం పోలీస్ కస్టడీలో ఉన్నారని, వీరితో విచారణ చేపట్టే పనిలో పోలీసులు నిమగ్నమై ఉన్నారని తెలిసింది. స్థానికులు చర్చించుకుంటున్న మేరకు విద్యుత్‌శాఖ లైన్‌మన్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌ది కృష్ణా జిల్లా గుడివాడ. 30ఏళ్ల క్రితం నుంచే చిన్నపాండూరు, వరదయ్యపాళెం ప్రాంతాల్లో లైన్‌మన్‌గా పనిచేశాడు. తాజాగా 2020లో ఉద్యోగ విరమణ పొందే సమయానికి వరదయ్యపాళెం లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ ప్రాంతంలోనే ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. అతనికి సమీప రక్తసంబంధీకులతో కూడా సత్సంబంధాలు లేవు.

సన్నిహితుడే హత్యకు పన్నాగం

వరదయ్యపాళెంలో విశ్రాంత లైన్‌మెన్ వెంకటేష్‌కు ఓ వ్యాపారితో గత కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం అత్యంత సన్నిహితులుగా, వారి కుటుంబ సభ్యుల్లో వెంకటేష్ ఒకడిగా మెలిగాడు. వెంకటేష్‌కు చెందిన ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వివరాలు సైతం ఆ వ్యాపారి కనుసన్నల్లో జరిగేవి. ఇటీవల తడ సమీపంలోని వెంకటేష్‌కు చెందిన భూమి అమ్మకం ద్వారా వచ్చిన నగదు సుమారు రూ.60లక్షలు సైతం ఆ వ్యాపారి తన అవసరాలకు ఉపయోగించుకున్నట్లు సమాచారం. ఏడాది క్రితం వెంకటేష్ అదృశ్యమైనప్పటికీ గత నెల వరకు నెలసరి వచ్చే పింఛన్ సొమ్మును కూడా అతనే డ్రా చేస్తునట్లు సమాచారం. ఇచ్చిన నగదును తిరిగి చెల్లించమని తెచ్చిన ఒత్తిడే వెంకటేష్ హత్యకు కారణమైందని తెలుస్తోంది. అంతేకాక వీరి మధ్య పెద్ద మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సమాచారం.

వెంకటేష్ మృతదేహాన్ని పాతి పెట్టిన ఆనవాళ్లు

కేవీబీపురం సమీపంలోని అంజూరు అటవీ ప్రాంతంలో విశ్రాంత లైన్‌మెన్ వెంకటేష్‌ను హతమార్చి మృతదేహాన్ని గుంతలో పాతి పెట్టారని తెలసింది. పోలీసుల అదుపులో ఉన్న వారు ఇద్దరూ పాతి పెట్టిన ప్రాంతాన్ని పోలీసులకు చూపించి వివరాలు నమోదు చేసుకున్నట్లు సమాచారం. అయితే వీరితో పాటు వ్యాపారి కారుకు డ్రైవర్ దుకాణంలో పనిచేస్తున్న మరో వ్యక్తి మృత దేహాన్ని పూడ్చేందుకు గుంతను తవ్వి సహకరించాడని ప్రచారం జరుగుతోంది. హత్య జరిగిన ప్రాంతం బీఎస్‌కండ్రిగ ప్రాంతంలోకి రానుండడంతో కేసు నమోదు ఎవరూ చేయాలన్న విషయంపై జిల్లా ఎస్పీ చర్చిస్తున్నట్లు సమాచారం.

ఆర్థిక లావాదేవీలా కోసమా? గుప్త నిధుల కోసమా?

వెంకటేష్ హత్య ఉదంతంలో పలు ఆసక్తికర విషయాలు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న అంబూరు గిరిజనకాలనీకి చెందిన వ్యక్తి గుప్త నిధుల వేట కోసం క్షుద్రపూజలు చేయడంలో దిట్ట. నిత్యం గుప్త నిధుల కోసం అన్వేషించే ఈయన వ్యాపారితో కలసి వెంకటేష్‌ను గుప్త నిధుల కోసం బలి ఇచ్చి హతమార్చారా? లేక ఆర్థికపరమైన లావాదేవీల్లో వచ్చిన మనస్పర్థల కారణంగా హతమార్చారా? అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

నేటి నుంచి ఏనుగుల గణన

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో బుధవారం నుంచి ఏనుగుల గణన చేపట్టనున్నారు. జిల్లాలో చివరిగా 2017లో గణన జరిగింది. జిల్లాలో మొత్తం 83 బీట్లు ఉన్నాయి. అందులో 41 బీట్ల నందు ఏనుగులు సంచరిస్తున్నాయి. ఎక్కువగా 37 బీట్ల వైపు వెళ్తున్నాయి. ప్రాణాంతకమైన సర్వేలో 10 బృందాలు పాల్గొననున్నట్లు డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు 15 కిలోమీటర్లు, 2వ రోజు పాదాలు, పేడ ఆధారంగా, 3వ రోజు అవి నీరు తాగే ప్రాంతాల్లో గణించనున్నారు.

మహిళపై లైంగికదాడికి మాంత్రికుడి యత్నం



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న రేణిగుంట సీఐ సుబ్బారెడ్డి



బాధితురాలి మెడపై గోళ్లతో రక్కిన గాయాలు

రేణిగుంట : చేతబడి అనుమానంతో తన వద్దకు వచ్చిన మహిళను ఓ మాంత్రికుడు నగ్నంగా పూజలో పాల్గొనాలంటూ బలవంతం పెట్టాడు. మాట వినకపోవడంతో ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. కామాంధుడి నుంచి తప్పించుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పరారైన మాంత్రికుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో జరిగింది. ఈ వివరాలను రేణిగుంట అర్బన్ సీఐ సుబ్బారెడ్డి మీడియాకు వెల్లడించారు. తారకరామానగర్‌కు చెందిన 35 ఏళ్ల మహిళకు ఇటీవల అనారోగ్య సమస్యలు వచ్చాయి. ఆస్పత్రులకు వెళ్లినా తగ్గకపోవడంతో.. తనకు ఎవరైనా చేతబడి చేశారేమోనని ఆందోళన చెందింది. దీంతో వారం కిందట శ్రీకాళహస్తి పట్టణం బహదూర్‌పేటకు చెందిన మాసారపు సుబ్బయ్య వద్దకు వెళ్లింది. ఇంటికి చేతబడి జరిగిందని.. రూ.20 వేలు ఇస్తే క్షుద్రపూజలు చేసి విముక్తి కల్పిస్తానంటూ ఆమెను సుబ్బయ్య నమ్మబలికాడు. రూ.7,500 అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఈనెల 14వ తేదీన రాత్రి 10 గంటలకు సుబ్బయ్య కారులో ఆమె ఇంటికి పూజా సామగ్రిని తీసుకువచ్చాడు. ఇంట్లోనే ముగ్గులు వేసి.. గుంతలు తవ్వి కొబ్బరికాయలు, నిమ్మకాయలు పెట్టాడు. ముగ్గుపై నగ్నంగా కూర్చుంటే పూజ ప్రారంభిస్తానని చెప్పగా.. అవాక్కయిన ఆ మహిళ నిరాకరించింది. దీంతో ఆమెపై సుబ్బయ్య లైంగిక దాడికి యత్నించాడు. బయటకు వచ్చేందుకు ఆమె పెనుగులాడుతుండటంతో.. చాకుతో పొడిచేందుకు ప్రయత్నించాడు. సుబ్బయ్యను తోసేసిన బాధితురాలు గట్టిగా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. చుట్టుపక్కల వాళ్లు అక్కడికి వచ్చేలోపే సుబ్బయ్య కారులో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించారు. మంగళవారం ఉదయం రేణిగుంట చెక్‌పోస్ట్ కూడలి వద్ద సుబ్బయ్యను అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. సమావేశంలో ఎస్ఐ ఈశ్వరయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కామ మాంత్రికుడు టీడీపీ నేతకు అనుచరుడు



చంద్రబాబు, బొజ్జల సుధీర్‌రెడ్డితో మాయల మాంత్రికుడు సుబ్బయ్య

వివాహితపై అఘాయిత్యానికి యత్నించి కటకటాలుపాలైన శ్రీకాళహస్తికి చెందిన సుబ్బయ్య టీడీపీ నేత అనుచరుడు. పదేళ్ల కిందట ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్న సుబ్బయ్య తనకు మంత్ర శక్తులు తెలుసునని స్థానికులను నమ్మించి శ్రీకాళహస్తిలోని బహదూరుపేటలో మంగళ, శుక్ర, ఆదివారాల్లో తన ఇంటి వద్దే అమ్మవారికి పూజలు చేసి తాయత్తులు కడుతూ గుంజుకునే వాడు.

ఎస్టీ సెల్‌లో కీలక పదవి

మాసారపు సుబ్బయ్య టీడీపీ తిరుపతి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్ష పదవిలో కొనసాగుతూ సోషల్ మీడియాలో టీడీపీ వాణిని బలంగా వినిపిస్తున్నాడు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి నమ్మిన బంటు. అతనిని సుధీర్‌రెడ్డి పార్టీ అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లకు పరిచయం చేసి వారితో ఫొటోలు దిగిన పరిస్థితి. మాంత్రికుడు మహిళలకు మాయమాటలు చెప్పి వశపరుచుకునేవాడనే ఆరోపణలున్నాయి. అయితే తన వెనుక రాజకీయ అండ ఉండడంతో అతని అకృత్యాలను బయటపెట్టేందుకు ఎవ్వరూ సాహసించలేదు.

బొజ్జల సుధీర్ కోసం తాంత్రిక పూజలు

టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డికి ఇతనితో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ కోవలోనే ఆయన రాజకీయ భవిష్యత్తు బాగుండాలని ప్రతివారం శ్రీకాళహస్తి స్వర్ణముఖీ నదిలో దిగంబరంగా సుబ్బయ్య తాంత్రిక పూజలు చేసి నరబలులు కూడా ఇచ్చాడనే ఆరోపణలున్నాయి.

నాడు–నేడు పనులు 75 శాతం పూర్తి



రాపూరులో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న డీఈఓ

రాపూరు: నెల్లూరు జిల్లాలో నాడు–నేడు పనులు ఇప్పటికే 75 శాతం పూర్తయ్యాయని, ఈనెల 20వ తేదీలోపు మిగిలిన పనులు పూర్తి చేస్తామని డీఈఓ గంగాభవాని తెలిపారు. రాపూరు మండలంలోని రాపూరు, సైదాదుపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో 977 పాఠశాలల్లో నాడు–నేడు పనులు జరుగుతున్నాయన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు అన్ని పాఠశాలలకు అందించినట్టు చెప్పారు. అలాగే జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చేస్తామన్నారు. రామిరెడ్డిపల్లి, జేపీపురం, మసీదుపేటలోని పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో కొత్తవి నిర్మించనున్నట్టు తెలిపారు. ఆమె వెంట ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్ఎంలు మస్తాన్, విజయలక్ష్మి, సంపూర్ణమ్మ, కవిత, సుగుణమ్మ, సిబ్బంది రమీజ్, ప్రసన్న, కుద్దూస్, ప్రసాద్, మురళి తదితరులు ఉన్నారు.

పశువును ఢీకొన్న స్కూటర్

చంద్రగిరి(తిరుపతి రూరల్): పశువుని స్కూటర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుడు అన్నమయ్య జిల్లా, సదుంకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. వివరాలు సదుం టౌన్‌లో నివాసమున్న ఎల్లయ్య (36), అదే మండలం, కమ్మంవారిపల్లికి చెందిన సాయి ఇద్దరూ స్నేహితులు. వ్యక్తిగత పనుల నిమిత్తం స్కూటర్‌పై తిరుపతికి వస్తుండగా చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురం సమీపంలోని రైల్వే గేట్ వద్ద రోడ్డుకు అడ్డంగా పశువు రావడంతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందగా, సాయికి తీవ్ర గాయాలయ్యాయి.

వేర్వేరు చోట్ల 27 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



తలకోన సౌత్‌బీట్‌లో స్వాధీనం చేసుకున్న దుంగలు, నిందితులతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

భాకరాపేట : వేర్వేరు రెండు చోట్ల జరిపిన దాడుల్లో 27 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఆయన కథనం.. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాలు మేరకు సోమవారం కూంబింగ్ చేపట్టారు. డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ నరేష్ బృందం కడప సబ్ కంట్రోల్ నుంచి బయలుదేరి తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట రేంజ్ మీదుగా దేవరకొండ సమీపంలోని ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్ వద్ద తనిఖీ చేశారు. సోమవారం సాయంత్రం ఎర్రావారిపాళెం మండలం తలకోన సౌత్ ఫారెస్టు బీటు పరిధిలో ఇద్దరు వ్యక్తులు 27 ఎర్రచందనం దుంగలను రవాణాకు సిద్ధంగా ఉంచుకుని కనిపించారు. వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ మైలావాండ్లపల్లెకు చెందిన వక్కల శ్రీనివాసులు, తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కాట్పాడికి చెందిన రూపేష్‌ను అదుపులోకి తీసుకుని 27 ఎర్రచందనం దుంగలను, పైలట్ కోసం సిద్ధంగా ఉంచిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని విచారించగా ఈ కేసులో మరో కీలక వ్యక్తి ఉన్నట్లు వెల్లడించినట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఎర్రావారిపాళెం మండలం నెరబైలు సమీపంలోని పులిబోనుపల్లికి చెందిన ఉయ్యాల సుబ్రమణ్యంను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఎస్బీఎంఎల్ తుపాకీ, 100 గ్రాముల నల్లమందు స్వాధీనం చేసుకున్నారు. దుంగలను ఎక్కడికి ఎగుమతి చేయడానికి సమకూర్చారనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం దుంగల బరువు 415 కేజీలు ఉండగా వాటి విలువ రూ.15 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

తిరుపతిలో ప్రిన్సిపల్ సెక్రటరీ సుడిగాలి పర్యటన

- సంక్షేమ పథకాలపై ఆరా
- అభివృద్ధి పనుల పరిశీలన
- జగనన్న కాలనీకి రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశం



దుర్గసముద్రంలోని జగనన్న కాలనీలో జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్యామలరావు

తిరుపతి రూరల్: ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తిరుపతి జిల్లా ప్రత్యేకాధికారి శ్యామలరావు మంగళవారం తిరుపతిలో సుడిగాలి పర్యటన చేశారు. తిరుపతి రూరల్, అర్బన్ మండలాల పరిధిలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను, స్కూల్స్‌లో నాడు–నేడు పనుల నాణ్యతను తనిఖీ చేశారు. తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌ను, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లో తనిఖీలు చేశారు. రైతులకు, రోగులకు అందిస్తున్న సేవలపై సిబ్బందికి ఎంత మేరకు అవగాహన ఉంది, ఎలాంటి సేవలందిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వాహణలో ఎలా ప్రవర్తిస్తున్నారు, రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సచివాలయంలోనే స్పందన కార్యక్రమంలో ఉంటున్నారా.. అంటూ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుర్గసముద్రంలోని జగనన్న కాలనీని సందర్శించారు. అక్కడ ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులకు చురకలు వేశారు. రవాణా సౌకర్యాలు కల్పించకపోతే ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఎలా మొగ్గుచూపుతారని జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించారు. రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు. తాగునీటి ఇబ్బందులు లేకపోయినా రోడ్లు అధ్వనంగా ఉన్నాయని కొందరు లబ్ధిదారులు స్పెషల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. అత్యవసరంగా రోడ్లు బాగుచేయాలని జిల్లా ఇంజినీరింగ్ అధికారి శంకర నారాయణను ఆదేశించారు. తర్వాత దామినేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

వేగవంతమైన సేవలు అందించేందుకే..

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను లబ్ధిదారులకు పారదర్శకంగా, వేగంగా అందించాలనే లక్ష్యంతోనే స్పెషల్ ఆఫీసర్ హోదాలో జిల్లాలో పర్యటించినట్లు ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు తెలిపారు. సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టిన తర్వాత అర్హుల గుర్తింపు, వారికి సత్వరమే లబ్ధి చేకూర్చడం జరుగుతోందని, క్షేత్రస్థాయిలో పథకాలు అమలు భేషుగ్గా ఉందని, చిన్న చిన్న సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించామన్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, ఆర్డీవో కనక నరసారెడ్డి, ఎంపీడీఓ వెంకటనారాయణ, డీఈఓ శేఖర్, పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ, అధికారులు పాల్గొన్నారు.